బెంబేలెత్తిస్తున్న.. బూడిద

- ఎన్టీపీసీ నుంచి భారీ వాహనాలతో తరలింపు
- రోడ్లన్నీ దుమ్ము, ధూళిమయం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

పరవాడ: ఎన్టీపీసీ నుంచి భారీ వాహనాలతో తరలిస్తున్న బూడిదతో ప్రయాణికులు, వాహన చోదకులు అవస్థ పడుతున్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్మాణ దశలో ఉన్న వంతెనలు, రహదారులతో పాటు ఇటుక, సిమెంట్ పరిశ్రమలకు సింహాద్రి ఎన్టీపీసీ విడుదల చేస్తున్న తడి, పొడి బూడిదను వినియోగిస్తారు. ఇక్కడ బూడిదను ఎటువంటి రుసుం వసూలు చేయకుండా సంస్థ ఉచితంగా సరఫరా చేస్తుంది. దీంతో ఆయా రోడ్లు, పరిశ్రమల యాజమాన్యాలు పిట్టవానిపాలెం సమీపంలోని బూడిద చెరువుల నుంచి భారీ వాహనాలతో బూడిదను తరలించుకుపోతున్నారు.

బూడిద దుమ్ముతో తీవ్ర అనారోగ్య సమస్యలు

ఎన్టీపీసీ, దేశపాత్రునిపాలెం మీదుగా ఏలేరు వరకు ఏర్పాటు చేసిన కారిడార్ రోడ్డులో ఈ బూడిద తరలింపు జరుగుతోంది. భారీ వాహనాలతో తరలిస్తున్న క్రమంలో ఎగసిపడుతున్న దుమ్ము, ధూళిని ప్రయాణికులు, ఉద్యోగులు, కార్మికులు పీల్చడం ద్వారా తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామని వాపోతున్నారు.

భద్రతా ప్రమాణాలు గాలికి..

బూడిద చెరువుల నుంచి బూడిదను లోడ్ చేసుకుని పిట్టవానిపాలెం, పి.బోనంగి, దేశపాత్రునిపాలెం కూడలి మీదుగా బూడిద లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. బూడిదను తరలించే క్రమంలో తీసుకోవలసిన భద్రతా ప్రమాణాలను యాజమాన్యాలు పాటించడం లేదు. బూడిద గాలిలో ఎగరకుండా లారీలపై టార్పాలిన్‌లు పూర్తి స్థాయిలో కప్పాలి. అలా కాకుండా ఏదో మొక్కుబడిగా టార్పాలిన్‌లు కప్పి బూడిదను తరలిస్తున్నారు.



ఎన్టీపీసీ కారిడార్‌లో బూడిద లారీలతో ఎగసిపడుతున్న దుమ్ము

బూడిద లారీలు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్లపై రాలి పడుతున్న పొడి బూడిద గాలిలో ఎగరకుండా నీటితో తడుపుతుండాలి. కానీ కాంట్రాక్టర్లు అటువంటి జాగ్రత్తలు పాటించడం లేదు. ఏదో మొక్కుబడిగా వారానికొక పర్యాయం తూతూ మంత్రంగా ధూళి ఎగరకుండా రోడ్లను తడుపుతూ మొక్కుబడి చర్యలు చేపడుతున్నారు. తడి బూడిద లారీల నుంచి కారిపోయి రోడ్లపై ముద్దలుగా పడి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బూడిద లారీలు రాకపోకలు సాగించే రహదారిలో ఉన్న దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలి, ఎస్ఈజెడ్ కూడలిలో నివసిస్తున్న ప్రజలు, వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీల రాకపోకలతో రోడ్లన్నీ దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. దేశపాత్రునిపాలెం నాలుగు రోడ్ల కూడలి, ఎస్ఈజెడ్ కూడళ్లు బూడిద మయమవుతున్నాయి. బూడిద లారీల నుంచి ఎగసిపడుతున్న దుమ్ము, ధూళి ద్వారా కళ్ల మంటలు, ఊపిరితిత్తుల సమస్యలు వచ్చిపడుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

భారీ వాహనాలతో రహదారులు శిథిలం..

అధిక బరువుతో ప్రయాణిస్తున్న భారీ వాహనాల కారణంగా రోడ్లు ధ్వంసం కావడం వల్ల ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. అందుకు కోట్లాది రూపాయలతో నిర్మించిన ఎన్టీపీసీ కారిడార్ రహదారినే ఉదహరణగా పేర్కొనవచ్చు.



లంకెలపాలెం రహదారిలో ఎగసి పడుతున్న దుమ్ముతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

రోడ్డంతా మోకాలి లోతు గుంతలతో నిండి రాకపోకలకు పనికి రాకుండా పోయింది. బూడిద లారీల కారణంగా లంకెలపాలెం-సబ్బవరం రహదారి పూర్తి స్థాయిలో ధ్వంసమైంది. ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు నిత్యం నరకం చవిచూస్తున్నారు. పాలకులు మాత్రం శిథిల రోడ్లను అభివృద్ధి చేయడానికి కనీస చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

అనారోగ్య సమస్యలొస్తున్నాయి

బూడిద లారీలు విడుదల చేస్తున్న దుమ్ము, ధూళి పీల్చడం వల్ల దగ్గు, గొంతు నొప్పి, ఆయాసం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాం. నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలు ఒక్కొక్క పర్యాయం కూడలిలో మొరాయిస్తున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. అధిక బరువుతో నడుస్తున్న బూడిద లారీలతో దేశపాత్రునిపాలెం కూడలి పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

– శనివాడ ప్రకాష్, దేశపాత్రునిపాలెం

కూడళ్లన్నీ బూడిదమయం

బూడిద లారీల రాకపోకలతో ఎస్ఈజెడ్ జంక్షన్ దుమ్ము, ధూళితో నిండిపోతోంది. ఫలితంగా చిరు వ్యాపారాలు తీవ్రంగా నష్టపోతున్నారు. బూడిద లారీల నుంచి ఎగసి పడుతున్న దుమ్ము ధూళి జంక్షన్‌లో గల పాన్ షాపులు, టీ దుకాణాలు, చెరకు రసం దుకాణదారుల పొట్ట కొడుతున్నాయి. దుమ్ముతో నిండిన సరకులను వినియోగదారులు కొనుగోలు చేయడం లేదు. ఫలితంగా తీవ్రంగా నష్టపోతున్నాం. అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదు.

– పి.నూకరాజు, చిరువ్యాపారి, ఎస్ఈజెడ్ కూడలి

క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం హైదరాబాద్‌లోని మియాపూర్‌కి చెందిన పి.రాము లక్ష రూపాయల విరాళం నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం బాలభోగం నివేదించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం తర్వాత సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించండి

సింహాచలం: జీవీఎంసీ 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురం, పల్లినారాయణపురంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ శనివారం వాకింగ్ విత్ పబ్లిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను ఆయా ప్రాంతాల నివాసితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రోడ్లు, కాల్వలు, రేషన్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ జోన్ – 8 అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, ఆదిబాబు, జెడ్సీ శంకర రావు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 105 మందికి కోర్టు రూ.రూ.6,06,000 జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీసియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వ్యాక్సినేషన్ శిబిరానికి అనూహ్య స్పందన

మహారాణిపేట: ఆడపిల్లల్లో క్యాన్సర్‌ను నివారించేందుకు వ్యాక్సినేషన్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, చైతన్య ప్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ట్రస్ట్, చైతన్య ప్రవంతి సంస్థల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల వ్యవధిలో ఆడపిల్లలకు రెండు డోస్‌ల వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. సామాజిక సేవా దృక్పథంతో ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. 9 నుంచి 14 ఏళ్ల వయసు గల ఆడపిల్లల కోసం నిర్వహించిన గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణ ఉచిత వ్యాక్సినేషన్ శిబిరానికి అనూహ్యమైన స్పందన లభించింది. ఈ నెల 13 నుంచి 16 వరకు టీకాలు వేయాల్సి ఉండగా.. తొలి రోజే 300 మందికి పైగా ఆడపిల్లలు వ్యాక్సిన్ వేసుకున్నారు. 670 మంది ఆడపిల్లలు తమ పేర్లు ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నారు. శిబిరంలో లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి రవిచంద్ర, డాక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ @ రూ.29,600



శివలింగం ఆకృతిలో ఉన్న 15 కిలోల లడ్డూ అందిస్తున్న యువకులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి సింహపురి కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు శనివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా 15 కిలోల శివలింగం ఆకృతిలో తయారు చేసిన లడ్డూ వేలం వేయగా కాలనీకి చెందిన లక్ష్మణ్, శివసాయి, గిరి తదితరులు కలిసి రూ.29,600కు దక్కించుకున్నారు. సింహపురి యూత్ వారికి లడ్డూ అందజేశారు. అలాగే స్వామి వారి పూలదండకి వేలం పాట నిర్వహించగా కాలనీకి చెందిన కె.కృష్ణ రూ.8600కి సొంతం చేసుకున్నారు. అనంతరం రాత్రి అనుపోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఉచిత అంబులెన్స్ కోసం వితరణ



అంబులెన్స్ కోసం నగదు అందిస్తున్న శ్రీదేవి

పెందుర్తి: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చనున్న ఉచిత అంబులెన్స్ కోసం ఎస్.శ్రీదేవి అనే మహిళ రూ.10 వేలు అందించారు. పెందుర్తిలో ట్రస్ట్ ప్రతినిధులు దాడి శ్రీనివాస్, సిరిమళ్ళ గణేష్‌కు శనివారం ఆమె నగదు అందించారు. దాతల సహకారంతో త్వరలో ఉచిత అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీను తెలిపారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

పరవాడ: స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. పరవాడ గ్రామంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పరవాడ మండలంలో 21,142 కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నాగరాజు, ఎంపీడీవో రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పాల్గొన్నారు.

- పరవాడలోని నూకాలమ్మ ఆలయం నుంచి బండారు వారి ఇళ్ల వరకు రోడ్డు మార్గం ఏర్పాటు



స్మార్ట్ రేషన్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును స్థానిక మహిళలు కోరారు. తాము నివసిస్తున్న గృహాల వద్దకు వాహనం వచ్చే మార్గం లేక ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోతే చేతులపై ఆస్పత్రికి మోసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

- స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలోని ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఐదో కుడో స్టేట్ కరాటే టోర్నమెంట్ – 2025 పోటీలను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శనివారం ప్రారంబించారు.

ప్రతిభ వెలికి తీసేందుకే బాలోత్సవం

పెందుర్తి: విద్యార్థుల్లో దాగి ఉన్న విశేష ప్రతిభా పాటవాలను వెలికి తీయడమే బాలోత్సవం ఉద్దేశమని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, బాలోత్సవం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. కళాశాలలో బాలోత్సవం – 2025 కార్యక్రమం శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు తొలి రోజు 23 అంశాల్లో పోటీలు నిర్వహించామన్నారు. బాలోత్సవం జిల్లా కార్యదర్శి జి.ఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ తొలి రోజు చిత్రలేఖనం, కథలు, కవితలు రాయడం, వ్యాసరచన, ఉత్తరం రాయడంతోపాటు శాస్త్రీయ, జానపద



ఆకట్టుకున్న విద్యార్థిని నృత్య ప్రదర్శన

నృత్యాలు, పౌరాణిక నాటికలు, గీతాలాపన, ఏకపాత్రాభినయం, ఫాన్సీ డ్రెస్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలిరోజు హాజరైన 600 మంది విద్యా



థింసా నృత్యంతో ఆకట్టుకున్న విద్యార్థినులు

ర్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి లలితా పీఠం ప్రతినిధులు భోజన సదుపాయం కల్పించారు. బాలోత్సవం ప్రతినిధులు పి.వి.రమణ, ఎ.చంద్రశేఖర్, ఉప్పాడ రాము, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన వ్యక్తి నేత్రాలు దానం



శ్రీనివాసరావు (ఫైల్)

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన ఓ వ్యక్తి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి పెద్ద మనసు చాటుకున్నారు. వివరాలివి.. స్థానిక ప్రశాంతినగర్‌లో నివాసం ఉంటున్న కంకటాల శ్రీనివాసరావు (67) శనివారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను నేత్రదానం కోసం ఒప్పించారు. మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు మృతుడు శ్రీనివాసరావు నేత్రాలు(కార్నియా) సేకరించారు.



శ్రీనివాసరావు నేత్రాలను దానం చేసేందుకు అంగీకార పత్రం అందిస్తున్న కుటుంబ సభ్యులు

పైడివాడలో అన్నసమారాధన



పైడివాడలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నాయకులు

సబ్బవరం: మండలంలోని పైడివాడలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకుడిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనను పార్టీ నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయుకులు బోకం రామునాయుడు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కోటాన రాము, సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, కాపుశెట్టి శేషుబాబు, బోను గంగునాయుడు, దాసరి శ్రీను, ఎం.వాసు, పిల్లి సుధ, సేనాపతి రాంబాబు, రాపర్తి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం



కరపత్రం విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ, తదితరులు

పరవాడ: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు కోసం ఈ నెల 15న రాష్ట్ర లేబర్ కమీషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు పరవాడలో శనివారం ఓ కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు కర్ణాటకలో ఉపకార వేతనాలు అందజేస్తున్నారు అన్నారు. తమిళనాడులో మరణించిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం అందజేయడమే కాకుండా మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తుండగా, ఇక్కడ కనీస చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తక్షణమే భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.నాగ అప్పారావు, పి.వి.రమణ, డి.అప్పారావు, ఎస్.సత్యారావు, జి.సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ. లక్ష చెక్కు అందజేత

పరవాడ: మండలంలో పెదముషిడివాడ శివారు పచ్చిగోరుపాలెం గ్రామానికి చెందిన కండిపల్లి పైడికొండ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జాగృతి సంస్థ సభ్యుడైన పైడికొండ కుటుంబానికి ఆ సంస్థ తరఫున మంజూరైన రూ.లక్ష ఇన్సూరెన్స్ చెక్కును సంస్థ ప్రతినిధి వడ్డాది కనకం శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. జాగృతి సంస్థలో పొదుపు చేస్తున్న సభ్యులు మరణిస్తే సంస్థ ఇన్సూరెన్స్ ద్వారా మృతుడి కుటుంబానికి భరోసా కల్పిస్తుందని సంస్థ ప్రతినిధి కనకం చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న జాగృతి సంస్థ ప్రతినిధి కనకం

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితుల పాకలు తొలగించడం సరికాదు

సబ్బవరం: రియల్ ఎస్టేట్ వ్యాపారుల లే అవుట్లకు రోడ్ల కోసం దళితుల పాకలు తొలగించడం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, ఏపీ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ తెలిపారు. మండలంలోని ఎల్లుప్పిలో సుమారు 150 ఎకరాలలో వేసిన లే అవుట్ వెంచర్ కోసం ఆ గ్రామ రెవెన్యూ పరిధిలోని గెడ్డవాగులో రోడ్ల ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులు తొలగించిన దళితుల పాకలను ఆయన శనివారం పరిశీలించారు. బాధితులు కాకర గౌరీ, కాకర వెంకట రమణ తదితరులతో మాట్లాడారు. తమ పూర్వీకుల నుండి ఇక్కడ పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామని బాధితులు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ముందస్తు సమాచారం లేకుండా జేసీబీతో తమ పాకలను తొలగించారని అన్నారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గండి ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గండి దేముడు, స్థానిక నాయకులు పాపాన ఎల్లాజీ, అమ్మరపిన్ని నరసింగరావు, పాపాన పెదబాబు, పాపాన అప్పారావు, గంతకోరు సూరినారాయణ, ఉగ్గిన కనకనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల రెవన్యూ అధికారులు తొలగించిన పశువుల పాకలు

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని ఆందోళన

బీచ్‌రోడ్డు: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆదివారం విశాఖలో పర్యటిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్ తదితరులు మాట్లాడారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడం లేదని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇంకో పక్క ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేయడం వెనుక గల మతలబు ఏమిటో చెప్పాలన్నారు. విశాఖకు ఏం చేశారని ఇక్కడ సభ పెట్టారని ప్రశ్నించారు. జె.పి. నడ్డా విశాఖ పర్యటనలో ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, విభజన చట్టంలోని హామీలు అమలు చేస్తామని, విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుండి ప్రారంభిస్తారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తే కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల్లో చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు, ఆర్. శ్రీనివాసరావు, కె. వనజాక్షి, ఎం.డి. బేగం, ఎం. మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్, ఎన్. నాగభూషణం, వై. రాంబాబు, ఎ. దేముడమ్మ, బి. పుష్పలత, కె. లక్ష్మణరావు, జి. జయ, ఎ. ఆదినారాయణ, పి. గోవింద్, జి. రాంబాబు, ఎం. శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ప్రచార రథం ప్రారంభం



జెండా ఊపి ప్రచార రథం ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ప్రచార రథాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు శనివారం రేసవాని పాలెంలో ఉన్న కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు జిల్లాలో ఈ ప్రచార రథం తిరుగుతుందన్నారు. ప్రజా సమూహాలు, మురికవాడల్లో ఈ రథం పర్యటిస్తుందన్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే ఇన్‌ఫెక్షన్లు, మాదక ద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యూర్ కోడ్ పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రోణంకి రమేష్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం మేనేజర్ ఉమామహేశ్వరరావు, సూపర్‌వైజర్ భద్రి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 15ని అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పొలిటికల్ సైన్స్ విభాగంలో కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ రాజ్యసభ సభ్యుడు, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.